క్లుప్తంగా

నేడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

వేమూరు: మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం శనివారం మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహించడం జరుగుతుందని ఎంపీడీవో బి.శ్రీమన్నారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ యల్లమాటి మోహనరావు అధ్యక్షత వహించడం జరుగుతుందన్నారు. ఈ సమావేశానికి ప్రజా ప్రతినిధులు, ఎంపీటీసీలు, గ్రామ సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు హాజరు కావలెనాని ఆయన తెలిపారు. హాజరు కాని అధికారులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

హైర్ బస్ డ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలి



రేపల్లె రూరల్: హైర్ బస్సు డ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ బాపట్ల జిల్లా అధ్యక్షుడు సీహెచ్ మణిలాల్ కోరారు. మదర్ థెరిస్సా హైర్ బస్ డ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం డిపో మేనేజర్ సునీల్ కుమార్‌కు వినతిపత్రం అందజేసి ఆయన మాట్లాడారు. హైర్ బస్ డ్రైవర్లకు ఉద్యోగ భద్రత కల్పించేలా ఐడీ కార్డులు, పీఎఫ్, ఈఎస్ఐను అమలు చేయాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీసీ డిపోలో హైర్ బస్సు డ్రైవర్లగా పనిచేస్తున్న కార్మికులు రోజురోజుకి పెరిగిపోతున్నారన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకొని హైర్ బస్సు డ్రైవర్ల సమస్యలను పరిశీలించాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు కె.వెంకట నాగ గోపి, రవికుమార్, ఎస్‌కే ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

కొల్లూరు ప్రీమియం లీగ్ పోటీలు ప్రారంభించిన ఎమ్మెల్యే



కొల్లూరు : క్రీడలతో యువత మానసిక పరిపక్వత పెరగడంతోపాటు, శారీరక దృఢత్వాన్ని పెంపొందించుకొని ఆరోగ్యవంతంగా జీవించవచ్చునని వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనంద బాబు అన్నారు. శుక్రవారం కొల్లూరు బాలురు, బాలికోన్నత పాఠశాలల క్రీడా మైదానంలో కొల్లూరు ప్రీమియం లీగ్ పేరుతో నియోజకవర్గ స్థాయిలో నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బాల్యంలో ప్రతి ఒక్కరూ క్రీడలలో పాల్గొనాలని సూచించారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ మైనేని మురళీకృష్ణ, మాజీ ఎంపీపీ కనగాల మధుసూదన్ ప్రసాద్, టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

రిక్షా కార్మికుడికి ఆర్థిక సాయం



తెనాలిఅర్బన్: మారీసుపేట శాంతినగర్‌లో నివాసిస్తున్న పేద రిక్షా కార్మికుడు పోలిమట్ల చంటికి సొపాటి కిరణ్ మిత్ర బృందం ఆధ్వర్యంలో శుక్రవారం రూ.10 వేలు నగదు, బియ్యం, నిత్యావసర వస్తువులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ నాయకుడు చిలకా కిరణ్ మాదిగ మాట్లాడుతూ చంటి సుమారు 40 ఏళ్ళపాటు రిక్షాను తొక్కుతూ జీవనం సాగిస్తున్నారని తెలిపారు. ఇటీవల పక్షవాతంతో బాధపడుతూ ఇంటికే పరిమితమయ్యారని చెప్పారు. కుటుంబ పోషణ కష్టమవడంతో సొపాటి కిరణ్ మిత్ర బృందం ఆధ్వర్యంలో ఆర్థిక సాయం చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో అత్తోట ప్రసాద్, వింజమూరి ఏసురాజు, దొప్పలపూడి శ్యామ్, కోపల్లె శ్రీనివాసరావు, రావూరి ఆనంద్, ఆకుల్‌నాథ్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియంత్రణకు బారికేడ్ల ఏర్పాటు



తెనాలిరూరల్: పట్టణ మార్కెట్ కూడలిలో ట్రాఫిక్ నియంత్రణకు బారికేడ్లను పోలీసులు ఏర్పాటు చేశారు. పట్టణానికి చెందిన నటరాజ్ జ్యుయలర్స్ అధినేత కొత్మా సుకుమార్ బారికేడ్లను తయారు చేయించి పోలీసులకు అందజేశారు. వీటిని మార్కెట్ వంతెన కూడలిలో ఏర్పాటు చేశారు. రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ వీటిని శుక్రవారం సాయంత్రం పరిశీలించారు. ట్రాఫిక్ సిబ్బందికి నూతన వస్త్రాలు (యూనిఫాం) అందజేశారు. అలానే పోలీసు శాఖ తెనాలిలోని ఆటోలకు కేటాయించిన క్యూర్ కోడ్‌తో కూడిన సీరియల్ నంబర్ల స్టిక్కర్లను ఆటోడ్రైవర్లకు అందజేశారు. ఆయన వెంట తహసీల్దార్ గోపాలకృష్ణ, మున్సిపల్ కమిషనర్ శేషన్న, డీఎస్పీ బి.జనార్ధనరావు, సీఐలు రాములనాయర్, ఆర్.ఉమేష్, రమేష్ బాబు, మల్లికార్జునరావు అధికారులు ఉన్నారు.

సీసీ రహదారులు సరే.. బరమ్స్ ఎక్కడ..?



బరమ్స్ లేకుండా నగరంలో పాత ఇండియన్ బ్యాంక్ సీసీ రహదారి



నగరంలో సినిమా హాల్‌కు వెళ్లే సీసీ రహదారి

నగరం: పాలకులు, అధికారుల నిర్లక్ష్యం వాహనచోదకుల పాలిట శాపంగా మారింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆర్భాటంగా ఎంఎన్ఆర్ఈజీఎస్, పంచాయతీ నిధులతో అరకొరగా గ్రామాలలో సీసీ రహదారులు నిర్మిస్తున్నారు. ఈ రహదారులకు బరమ్స్ మరవడంతో వాహనచోదకులకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామాలలో సీసీ రహదారులకు బరమ్స్ లేకపోవడంతో ప్రమాదాలకు నెలవుగా మారుతున్నాయి. మండలంలోని పలు గ్రామాలలో ఇటీవల వేసిన సీసీ రోడ్లకు సైడ్ బరమ్స్ పోయకపోవడంతో వాహనచోదకులు నిత్యం ప్రమాదాలకు గురవుతున్నారు. రాత్రి సమయాలలో ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనచోదకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సీసీ రహదారులకు బరమ్స్‌కు నిధులు కేటాయించిన ఇప్పటివరకు బరమ్స్ ఎందుకు పోయలేదని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సీసీ రహదారులకు బరమ్స్ పోసి ప్రమాదాలను నివారించాలని ప్రజలు కోరుతున్నారు.

చర్యలు చేపడతాం

సీసీ రహదారులకు బరమ్స్ ఏర్పాటుకు నిధులు కేటాయించాం. రహదారులకు తప్పనిసరిగా బరమ్స్ పోయాలి. నూతనంగా నిర్మిస్తున్న అన్ని సీసీ రహదారులకు బరమ్స్ వేసేలా చర్యలు చేపడతాం.
– సురేంద్ర, పీఆర్ ఏఈ



నగరంలో బరమ్స్ లేని సీసీ రహదారి

దోమల నివారణతో వ్యాధులు దూరం



రేపల్లెలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది



కర్లపాలెంలో ర్యాలీ నిర్వహించిన వైద్య ఆరోగ్య సిబ్బంది



కూచినపూడిలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ కృష్ణయ్య

రేపల్లె రూరల్: దోమల నివారణతో అనేక వ్యాధులను నిర్మూలించవచ్చని మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ వైవీ కృష్ణయ్య అన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలో శుక్రవారం నిర్వహించిన ర్యాలీలో ఆయన పాల్గొని మాట్లాడారు. తేమ వాతావరణం, నీటి నిల్వలు ఉన్న దోమల ఉధృతి పెరుగుతుందన్నారు. ఇంటి పరిసర ప్రాంతాలలో నీటి నిల్వలు లేకుండా పర్యవేక్షించుకోవటంతో పాటు మురుగు కాలువలలో చెత్త పడవేయకుండా ఉండాలన్నారు. దోమకాటుతో మలేరియా, డెంగీ, ఫైలేరియా, మెదడువాపు వ్యాధి, వంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉందన్నారు. ఈ సందర్భంగా అందరిలో మార్పు వస్తే మలేరియా అర్థమవుతుంది అనే నినాదంతో పట్టణ వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్లు ఎస్.రమేష్, జాన్ ప్రసాదు, శ్రావన్య, షాహిద్, ఏఎస్ఎంలు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అదే విధంగా ప్రపంచ మలేరియా నివారణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం కూచినపూడి పీహెచ్‌సీలో ర్యాలీ నిర్వహించారు. దోమకాటుతో కలిగే వ్యాధులను, వాటి నివారణకు తీసుకోవాల్సిన చర్యలను డాక్టర్ నాగార్జున వైద్యశాలలోని రోగులకు, పరిసర ప్రాంత ప్రజలకు వివరించారు. అనంతరం పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు.



వేటపాలెంలో మలేరియా అవగాహన ర్యాలీలో వైద్య సిబ్బంది

కర్లపాలెంలో...

కర్లపాలెం: పరిసరాల పరిశుభ్రత పాటించి దోమలను నివారించాలని ఎంపీడీవో అద్దూరి శ్రీనివాసరావు చెప్పారు. జాతీయ మలేరియా దినోత్సవం సందర్భంగా వైద్య ఆరోగ్య సిబ్బంది మలేరియా వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలని శుక్రవారం మండల పరిషత్ కార్యాలయం నుంచి కర్లపాలెం సెంటర్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం కర్లపాలెం సెంటర్‌లో మానవహారం చేపట్టి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుందాం దోమలను నివారించుకుందాం అంటూ ప్రతిజ్ఞ చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీడీవో మాట్లాడుతూ దోమకాటు వలన ప్రాణాంతకమైన వ్యాధులు వస్తున్నాయని తగిన జాగ్రత్తలు పాటించాలని చెప్పారు. ఇంటి పరిసరాలలో నీరు నిలిచి ఉంటే దోమల ఉధృతి పెరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, ఎంఎల్ హెచ్‌పీవోలు పాల్గొన్నారు.

చుండూరులో...

చుండూరు(వేమూరు): దోమల వల్ల మలేరియా వ్యాప్తి చెందకుండా ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పీహెచ్‌సీ వైద్యాధికారి ఎం.కృష్ణవేణి అన్నారు. చుండూరు మండలంలోని వేటపాలెం పీహెచ్‌సీ పరిధిలో శుక్రవారం ప్రపంచ మలేరియ దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మలేరియా రహిత సమాజ నిర్మాణంలో భాగంగా మలేరియా నిర్మూలనకు ఆరోగ్య సిబ్బంది పని చేయాలని ఆమె సూచించారు. దోమల నిర్మూలనకు కృషి చేయాలన్నారు. ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రైడే పాటించాలని ఆమె తెలిపారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించండి మహాప్రభో

ఎమ్మెల్యేకు సమస్యల వెల్లువ



అర్జీలు స్వీకరిస్తున్న వేమూరు ఎమ్మెల్యే ఆనందబాబు

కొల్లూరు : అపరిష్కృతంగా ఉన్న సమస్యలతో ఇబ్బందులు పడుతున్న ప్రజలు సమస్యలు పరిష్కరించండి మహాప్రభో అంటూ వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు వద్ద మొరపెట్టుకున్నారు. శుక్రవారం కొల్లూరు ఎంప్లాయిస్ రిక్రియేషన్ హోమ్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో మండలంలో పలు సమస్యలపై అర్జీలు వెల్లువెత్తాయి. వేమూరు ఎమ్మెల్యే ఆనంద బాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో భాగంగా అధిక శాతం రెవెన్యూ సమస్యలపై అర్జీలను ప్రజలు అందజేశారు. కొల్లూరు శివారు కేటీ కాలనీలో ఇళ్ల స్థలాలకు పట్టాలు, దోనేపూడి చెరువు పోరంబోకులో పట్టాల మంజూరుతోపాటు, పలు రెవెన్యూ సమస్యలపై 21 అర్జీలు అందినట్లు తహసీల్దార్ బి.వెంకటేశ్వర్లు తెలిపారు. రహదారుల ఆక్రమణలు, అంతర్గత రహదారుల నిర్మాణాలు, డ్రైనేజ్ వ్యవస్థ మెరుగుపరచడం వంటి పంచాయతీరాజ్ సమస్యలపై మరో 7 అర్జీలు అందినట్లు పేర్కొన్నారు. సమస్యలపై అందిన అర్జీలను పరిశీలించి తక్షణం పరిష్కరించడానికి కృషి చేయాలని ఎమ్మెల్యే అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కె.నరసింహారావు, అధికారులు, మాజీ ఎంపీపీలు కనగాల మధుసూదన్ ప్రసాద్, మైనేని మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పదిలో రాణించిన విద్యార్థికి అభినందనలు

కొల్లూరు : పదో తరగతి ఫలితాలలో కొల్లూరు బాలురోన్నత పాఠశాల విద్యార్థి ఉత్తమ మార్కులతో పాఠశాల ప్రథమ స్థానం సాధించడం అభినందనీయమని వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనంద బాబు అన్నారు. శుక్రవారం కొల్లూరులో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రభుత్వ పాఠశాలలో విద్యను అభ్యసిస్తూ 588 మార్కులు సాధించిన విద్యార్థి శనివరపు సాయినాగసూర్యను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్తులో ఉన్నత చదువుల్లో రాణించాలని ఆకాంక్షించారు. విద్యార్థికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు కనగాల మధుసూదన్ ప్రసాద్, మైనేని మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పాకిస్తాన్ ప్రేరేపిత ఉగ్రవాదం నశించాలి



కొవ్వొత్తుల ప్రదర్శన చేపట్టిన నాయకులు

బాపట్ల: పహల్గామ్‌లో జరిగిన ఉగ్ర దాడికి నిరసనగా శుక్రవారం బాపట్ల జమ్ములపాలెం ఫ్లైఓవర్ దగ్గర అంబేడ్కర్ విగ్రహం వద్ద సమాజ్‌వాదీ పార్టీ బాపట్ల జిల్లా నాయకులు ఇతర లౌకిక ప్రజాస్వామ్య వాదులు కలిసి కొవ్వొత్తులు వెలిగించి నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా సమాజ్‌వాదీ బాపట్ల జిల్లా అధ్యక్షుడు మేధ శ్రీనివాసరావు మాట్లాడుతూ భారతదేశం చాలా ప్రశాంతమైన దేశమని, భిన్నత్వంలో ఏకత్వంతో బహుళ జాతులు మతాలు, భాషలు సంస్కృతులు కలిగినప్పటికీ అంతర్లీనంగా మేమంతా భారతీయులం అనే ఆత్మీయ భావనతో విరాజిల్లుతున్న దేశం అన్నారు. ఈ మధ్య కొంతమంది మతం ముసుగులో రాజకీయ అవసరాల కోసం విద్వేషాలను రెచ్చగొట్టే కార్యక్రమాలు చేపడుతూ ప్రజల మధ్య వైషమ్యాలు రగిలించే విధంగా ప్రవర్తిస్తున్నారన్నారు. కార్యక్రమంలో దాసరి శ్యామ్ లివింగ్‌స్టన్, ఖలీలుద్దీన్, మేకతోటి శరత్, ఐజాక్, ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

దళితుడిని చెప్పుతో కొట్టిన నాయకుడిని సస్పెండ్ చేయాలి



మాట్లాడుతున్న మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుస్సా నాగరాజు

వేమూరు: నియోజకవర్గ జనసేన సమన్వయకర్త ఊస రాజేష్ దళితుడిని చెప్పుతో కొట్టడం దారుణమని మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుస్సా నాగరాజు పేర్కొన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దళితుడిని చెప్పుతో కొట్టిన జనసేన నాయకుడు ఊసా రాజేష్‌ను పార్టీ నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత అగ్ర కులాలకు చెందిన నాయకులు బినామీ పేర్లతో సబ్సిడీ రుణాలు పొందేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని తెలిపారు. కొండయ్యను చెప్పుతో కొట్టడాన్ని ఖండిస్తున్నట్లు తెలిపారు. పార్టీ నుంచి రాజేష్‌ను సస్పెండ్ చేసే వరకు ఆందోళన చేపట్టడం జరుగుతుందన్నారు. అదే విధంగా పోలీసులు రాజేష్‌ను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. దళితలపై ప్రాంతీయ పార్టీలు అధారపడి అధికారం చేపట్టడం జరిగిందన్నారు. పంచాయతీరాజ్ మంత్రి పవన్ కళ్యాణ్ నియోజకవర్గంలో దళితులను గ్రామ బహిష్కరణ చేయడం, అదే విధంగా చావలి గ్రామంలో దళితుడిని చెప్పుతో కొట్టడం జరిగిందన్నారు. కూటమి ప్రభుత్వం దళితులపై దాడులు చేస్తే ఆందోళన కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో బాధితుడు కొండయ్య, మాల మహానాడు నాయకులు పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

కొల్లిపర: భర్త, అత్తమామల వేధింపులు తాళలేక వివాహిత ఆత్మహత్యాయత్నం చేసింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని వల్లభాపురంకు చెందిన చప్పిడి సంధ్యారాణికి ఆరేళ్ల క్రితం వివాహం జరిగింది. భర్త, అత్త, మామ తీవ్ర మానసిక, శారీరక వేధింపులకు గురి చేస్తుండడంతో మనస్తాపానికి గురై గురువారం ఒంటిపై డీజిల్ పోసుకుని నిప్పంటించుకుని ఆత్మహత్యాయత్నం చేసింది. తీవ్ర గాయాలపాలైన ఆమెను కుటుంబసభ్యులు గుంటూరులోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. సమాచారమందుకున్న కొల్లిపర ఎస్ఐ పి. కోటేశ్వరరావు వైద్యశాలకు వెళ్లి బాధితురాలి స్టేట్‌మెంట్ రికార్డు చేశారు. కేసు నమోదు చేసినట్టు శుక్రవారం వెల్లడించారు.

ఉగ్ర దాడిలో అసువులు బాసిన పర్యాటకులకు నివాళి



కొల్లూరు బస్టాండ్ సెంటర్‌లో క్యాండిల్స్ ప్రదర్శన

కొల్లూరు : పర్యాటకులపై విరుచుకుపడి ఆటవికంగా మట్టుపెట్టిన ఉగ్రవాదులను తక్షణం శిక్షించడంతోపాటు, ఉగ్రవాదాన్ని కేంద్ర ప్రభుత్వం పూర్తిగా రూపుమాపాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం రాత్రి కొల్లూరు బస్టాండ్ సెంటర్లో సీపీఎం ఆధ్వర్యంలో ఉగ్రమూకల దాడిలో అసువులు బాసిన పర్యాటకులకు నివాళులర్పించారు. స్థానిక ఆటో యూనియన్ నాయకులతో కలసి క్యాండిల్స్‌తో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం ఉగ్రవాద చర్యలపై సమగ్ర విచారణ జరిపి వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఉగ్రవాదుల దాడిలో గాయపడిన క్షతగాత్రులు త్వరగా కోలుకునేలా కేంద్ర ప్రభుత్వం సహకరించాలని కోరారు. ఉగ్రయూకల దాడిలో మృతి చెందిన కుటుంబాలకు తమ సానుభూతి తెలియజేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి సభ్యులు టి.కృష్ణమోహన్, మండల కార్యదర్శి వి.వెంకట్రామయ్య, నాయకులు బి.సుబ్బారావు, ఆటో యూనియన్ నాయకులు దాసు, నాగరాజు, శ్రీను, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

'హెల్త్ ఆన్ వీల్స్' ప్రాజెక్టు ఆరంభం

ప్రారంభించిన సబ్‌కలెక్టర్ సంజనా సింహ



హెల్త్ ఆన్ వీల్స్ వాహనంతో సంజనా సింహ, డాక్టర్ శారద ప్రభృతులు

తెనాలి: పట్టణానికి చెందిన డీ3 శారద సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో 'హెల్త్ ఆన్ వీల్స్' ధర్మ వాహనాన్ని శుక్రవారం సబ్‌కలెక్టర్ వి.సంజనా సింహ చేతులమీదుగా ప్రారంభించారు. ఈ వాహనంతో 24 గంటలు ఫస్ట్‌ఎయిడ్, గుండెపోటు సంబంధిత సేవలను అందిస్తారు. వీటితోపాటు మహిళల్లో క్యాన్సర్ స్క్రీనింగ్, హెచ్‌పీవీ వ్యాక్సిన్, పాప్‌స్మియర్ పరీక్ష వంటి సేవలను అందుబాటులోకి తీసుకొస్తున్నట్టు సొసైటీ వ్యవస్థాపకురాలు డాక్టర్ డి.శారద వెల్లడించారు. వీటితోపాటు హెల్త్ ఎడ్యుకేషన్, డైట్, న్యూట్రిషన్, ఒబెసిటీ అంశాలపై అవగాహన కల్పిస్తామని చెప్పారు. ఎన్‌సీడీఎస్ వ్యాధులను ముందుగానే గుర్తించి, నివారణకు కృషిచేయాలనేది లక్ష్యంగా వివరించారు. సబ్‌కలెక్టర్ కార్యాలయ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో వివిధ యూనియన్లకు చెందిన ఉపాధ్యాయులు డీవీ సుబ్బారావు, రామచంద్ర, ఎస్.రవికుమార్, ప్రసాద్, విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు ఉమామహేశ్వరరావు, రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షుడు పావులూరి రాంబాబు, అనూరాధ పాల్గొన్నారు.

బాపట్ల విస్తరణ శిక్షణ కేంద్రం ప్రిన్సిపాల్‌కు ప్రశంసాపత్రం

బాపట్ల: 'రాష్ట్రీయ గ్రామీణ స్వశక్తీకరన్ అభియాన్' పథకం కింద అత్యధిక శిక్షణ కార్యక్రమాలు చేపట్టినందుకు బాపట్ల విస్తరణ శిక్షణ కేంద్రం ప్రిన్సిపాల్ డి.వెంకట్రావు ప్రభుత్వం నుంచి ప్రశంసాపత్రం అందుకున్నారని ఫోరం ఫర్ బెటర్ బాపట్ల కార్యదర్శి డాక్టరు పి.సి.సాయిబాబు పేర్కొన్నారు. జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా గురువారం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చేతుల మీదుగా ఆయన ఈ పురస్కారాన్ని అందుకున్నారు. ఈ మేరకు ప్రిన్సిపాల్‌ను ఫోరం ఫర్ బెటర్ బాపట్ల కార్యదర్శి సాయిబాబు, సభ్యులు ఎం.నరసింహారావు, ఈటీసీ వైస్ ప్రిన్సిపాల్ పి.పద్మజ, ఫ్యాకల్టీ సభ్యులు కె.లలిత, పి.రామకృష్ణ, జి.నాగేశ్వరరావు సన్మానించారు.

శాంతిభద్రతల విఘాతకులను దీటుగా ఎదుర్కొందాం



మసీదు వద్ద నల్లజెండాలతో నిరసన తెలుపుతున్న మసీదు పెద్దలు

తెనాలిటౌన్: శాంతి భద్రతలకు విఘాతం కలిగించే చర్యలను ప్రజాస్వామ్యయుతంగా ఎదుర్కొందామని రాష్ట్ర ఇమానే మజ్లిస్ కమిటీ కార్యదర్శి షేక్ ఫరీద్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక బుర్రిపాలెం రోడ్డులోని బీసీ కాలనీ అర్కమ్ మసీద్ వద్ద పహల్గాం ప్రాంతంలో ఉగ్రదాడిలో మరణించిన వ్యక్తులకు ఘన నివాళులర్పించారు.

అనంతరం వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఉగ్రదాడిని కులమతాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ ఖండించాలని మసీదు పెద్దలు ముక్త కంఠంతో నినదించారు. ఉగ్రమూకలను మట్టుపెట్టడంలో భారత సైన్యానికి ప్రతి ఒక్కరూ అండగా నిలబడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మౌలానా మసూద్ అహ్మద్, షేక్ షబ్బీర్, షేక్ సత్తార్, షేక్ మునీర్, తాజ్ బాషా, తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సామర్థ్యం అంచనాపై సమగ్ర సర్వే



బ్రోచర్‌ను విడుదల చేస్తున్న కమిషనర్ బండి శేషన్న

తెనాలిటౌన్: తెనాలి పురపాలక సంఘ పరిధిలోని పొడి చెత్తను సేకరించే అసంఘటిత కార్మికుల వ్యక్తిగత వివరాలు, సామర్థ్య అంచనా కోసం సమగ్ర సర్వే నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న తెలిపారు. నేషనల్ యాక్షన్ ఫర్ మెకానిజెడ్ శానిటేషన్ ఎకో సిస్టం పథకం అనేది పొడి వ్యర్థాలను సేకరించే వారి కోసం పారిశుద్ధ్య కార్మికులకు వృత్తిపరమైన గుర్తింపు కార్డులు పీపీఈ కిట్లు, సామాజిక భద్రత, ఆర్థిక చేరిక, ఆరోగ్య ప్రయోజనాలు, నైపుణ్య మెరుగుదలపై శిక్షణ అందించడం ద్వారా వారి సాధికారత కల్పించేందుకు ఉద్దేశించిన పథకం నమస్తే పేరిట ఎన్యూమరేషన్ నిర్వహించేందుకు యాప్‌ను పెంపొందించారు. దళిత బహుజన రీసోర్స్ సెంటర్ అనే స్వచ్ఛంద సంస్థ గుంటూరు జిల్లాల్లో ఎన్యుమరేషన్ చేపట్టనున్నది. దీనిలో భాగంగా శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ బండి శేషన్న బ్రోచర్‌ను ఆవిష్కరించారు.

కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతి రావు, హెల్త్ ఆఫీసర్ హెలెన్ నిర్మల, డీబీఆర్‌సీ ప్రతినిధులు పాల్గొన్నారు.

పరిమిత వేగంతో ప్రయాణించాలి



ఆటో ప్రయాణికులతో మాట్లాడుతున్న ఎస్ఐ వెంకటశివకుమార్

చందోలు(కర్లపాలెం): పరిమిత వేగంతో ప్రయాణించి సురక్షితంగా గమ్య స్థానాలను చేరాలని చందోలు ఎస్ఐ ఎం.వెంకటశివ కుమార్ చెప్పారు. శుక్రవారం పిట్టలవానిపాలెం మండలంలోని రెడ్డిపాలెం టోల్‌ప్లాజా సమీపంలో ఎస్ఐ తమ సిబ్బందితో వాహనాల తనిఖీ నిర్వహించారు. ద్విచక్ర మోటారు వాహనాలపై ప్రయాణించే వారు హెల్మెట్ పెట్టుకోవాలని, కార్లు నడిపే వారు సీటు బెల్టు పెట్టుకోవాలని ఎస్ఐ తెలిపారు. ఆటోలలో పరిమితికి మించి ప్యాసింజర్లను ఎక్కించవద్దని పరిమిత వేగంతోనే వాహనాలు నడపాలని ఆటో డ్రైవర్లకు, ప్యాసింజర్లకు చెప్పారు. వాహనాలకు సంబందించిన ధ్రువీకరణ పత్రాలన్నీ వాహనంలో ఉంచుకోవాలని ఎస్ఐ అన్నారు.